## దటీజ్ తెలంగాణ

ఉమ్మడిరాష్ట్రంలో 2004-2013 మధ్య 8,198 మంది రైతులు కరెంట్ షాక్‌తో మరణించారు. బీఆర్ఎస్ సర్కారు వచ్చాక విద్యుత్ సరఫరా వ్యవస్థను మెరుగుపరచడంతో మరణాలు తగ్గాయి.

సంక్షేమం



రక్తహీనతతో బాధపడే తల్లులు, పోషకాహార లోపంతో వయసుకు తగ్గట్లు పిల్లలు ఎదగకపోవడాన్ని గుర్తించిన సర్కారు 'ఆరోగ్యలక్ష్మి'ని తీసుకువచ్చింది. 149 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నది.

ఆరోగ్యలక్ష్మి పథకం

ప్రారంభం 2015

లబ్ధిదారులు 35,80,656



ఎన్నో సార్లు తమ చేతికి పాలనా పగ్గాలను అప్పగిస్తే వాళ్లు చూపించింది రిక్తహస్తాలే! దశాబ్దాల పాలనలో అవినీతిపరుల చేతికి చిక్కి అరిగోసలు పడ్డాం. ఢిల్లీ హైకమాండ్ రిమోట్ నొక్కితే కానీ తెలంగాణ గల్లీల్లో ఏం అభివృద్ధి చేసుకోవాలనే నిర్ణయాలు తీసుకోలేని సీల్డ్ కవర్ సీఎంల పాలన మళ్లీ అవసరమా? ఏలిన పాలకులు మన బతుకులను విధ్వంసం చేసింది చాలక మళ్లీ ఏం ఒరగబెడతారని వస్తున్నారు? గతంలో వారి పాలనా తీరు మనకు తెలియనిదా?! కౌంటింగ్ రోజు నుంచే గ్రూప్ రాజకీయాలకు పాల్పడుతూ, ఆర్నెల్లకో సీఎంను మారుస్తూ ఎప్పుడూ అంతర్గత పంచాయితీలతోనే కాలం గడిపేవాళ్లు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టేదెప్పుడు? కొత్త రాష్ట్రంగా ప్రపంచ పటంలోకెక్కి ఇప్పుడిప్పుడే అభివృద్ధి బాట పట్టిన తెలంగాణను మళ్లీ వారి చేతుల్లో పెడితే వెనక్కి తీసుకెళ్తారే తప్ప ముందుకు నడిపించలేరనేది కఠోర సత్యం. ఉన్న తెలంగాణను ఊడబీకి ఏండ్లకేండ్లు గొడగొడ ఏడిపించినవాళ్లు.. వీళ్లేనని అప్పుడే మర్చిపోగలమా?! వీళ్లకా ఒక్క చాన్స్ ఇచ్చేది.. వీళ్లకా మద్దతు తెలపాల్సింది?! ఆ కబంధ 'హస్తా'ల్లో మళ్లీ బందీలు కావొద్దు.. మార్పు అంటూ 'కూనీ'రాగాలు తీస్తూ వస్తున్న వాళ్ల కండ్లకు కనిపించడంలేదా.. మార్పు ఎప్పుడో, పదేండ్లనాడే మొదలైందన్నది! మంచి చేసినోళ్ల దిక్కే నిలుద్దాం.. సుస్థిర పాలనను అందిస్తున్న సర్'కారు'నే కొనసాగిద్దాం!!

■ సాహిత్ చంద్ర



## సోషల్ యాంగిల్

### మన ఐడెంటిటీ

మన ధైర్యం
మన సైన్యం
మన మార్గం
మన చైతన్యం
మన ఐడెంటిటీ
'మన కేసీఆర్‌ర్‌ర్‌'



### ఆ మాట గ్యారంటీ

ఆ సూపు గ్యారంటీ
ఆ నడక గ్యారంటీ
ఆయన చిరునవ్వు గ్యారంటీ
గెలుపు అంతకంటే గ్యారంటీ
పెద్దసారుంటేనే
'తెలంగాణ అభివృద్ధి' గ్యారంటీ



### సిగ్నలివ్వు

ఓ కొత్త ఓటరా!
ఇక ఓటు సంధించు
అబద్ధాలను నొక్కిపట్టు
అభివృద్ధికి సిగ్నలివ్వు
సంక్షేమం కొనసాగించు

### మళ్లొక్క ఓటు

ఒక్క ఓటేనని ఆగకు
అభివృద్ధిని ఆపకు
కారుకోటేయ కదలిరా
సర్కారుకు జై కొట్ట పిడికిలెత్తిరా
ప్రగతికి పట్టం గట్ట కలిసిరా
కేసీఆర్‌ను యాది ఉంచుకో
మళ్లొక్క ఓటుతో దీవించిపో.

■ సురేందర్ బండారు

'ఇప్పుడు తెలంగాణ ఇజ్జత్ దునియాల మస్తు పెరిగింది. పదేండ్లల్ల బగ్గ పనులైనయ్. మస్తు తేజ్ అయ్యింది ఇంకా ఐదుపదేండ్లు ఒక్కటే చేతిలో ఉంటే రాష్ట్రం ఇంకా బలపడ్తది' అంటున్నారు డాక్టర్ టీ సంపత్ కుమార్. కెనడియన్ హై కమిషన్ (ఢిల్లీ) సీనియర్ సలహాదారుగా పనిచేసిన ఆయన 2015లో ఉద్యోగ విరమణ పొందారు. ఆయన అందించిన విశిష్ట సేవలకు కెనడా ప్రభుత్వం నుంచి ఎనిమిది అవార్డులు అందుకున్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో 300లకుపైగా వ్యాసాలు, కథలు రాశారు. ఎనిమిది పుస్తకాలను ప్రచురించారు. ఢిల్లీలో 37 ఏండ్లు గడిపి తెలంగాణలో స్థిరపడ్డ ఈ సీనియర్ సిటిజన్ తన స్వగతాన్నీ, తెలంగాణ గతాన్నీ 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నారు. ఆ ముచ్చట్లు ఆయన మాటల్లోనే...

# తెలంగాణ.. మస్తు తేజ్ అయింది!

ఢిల్లీలో 37 ఏండ్లు గడిపి తెలంగాణలో స్థిరపడ్డ కెనడియన్ హై కమిషన్ సీనియర్ సలహాదారు మనోగతమిది

నేను ఆదిలాబాద్ జిల్లాలోని ఖానాపూర్ (ఇప్పుడు నిర్మల్ జిల్లా) అనే చిన్న ఊర్లె 1956ల పుట్టిన. బాపు నాలుగోతరగతి. అమ్మకు సదురాదు. చిన్నప్పటినుంచి నాకు సదువంటే బగ్గిష్టం. పదోది ఖానాపూర్‌ల సదివిన. ఇంటర్, డిగ్రీ తెలుగు మీడియంల నిర్మల్ల చేసిన. హైద్రాబాద్‌ల ఉస్మానియా యూనివర్సిటీల ఎమ్మెస్సీ కాంగనే 1978ల ఢిల్లీకి ఇంకా సదుకోనేందుకు పోయిన. ఐఐటీ ఢిల్లీ నుంచి డాక్టరేట్ తీసుకున్న. సదుకోనేటప్పుడే ఉద్యోగం అచ్చింది. గట్ల నాలుగు ఉద్యోగాలు మారి, చివరి 22 సంవత్సరాలు కెనడియన్ హై కమిషన్ ఢిల్లీల పని చేసిన. 2015ల రిటైర్ అయిన. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంల నిర్లక్ష్యానికి గురై ఎన్కబడ్డ ప్రాంతంగా ఉన్న తెలంగాణ వాసిగా ఢిల్లీలో 1985 నుంచి మొదలైన నా సంసార జీవితం 37 సంవత్సరాలు దేశ రాజధానిలో గడిపి శేష జీవితానికి తెలంగాణ రాష్ట్రానికి చేరుకొని గర్వంగా బతుకుతున్న.

అయితే, ఢిల్లీల సంవత్సరాలు గడిచినకొద్దీ మన తెలంగాణ ప్రాంతం బగ్గ గుర్తుకొస్తుండే. మనం, మనోల్లు, మన ఊర్లు ఎందుకు వెనుకబడి ఉండే? గిసుంటి ఆలోచనలే మదిల తిరుగుతుండే. ఢిల్లీల ఆంధ్ర దోస్తులుండ్రి. గాల్లు మన తెలంగాణోల్లకేమీ తెలదన్నట్లే మాట్లాడుతుండ్రి. మీకు సదురాదు, ఎవుసాయం తెలదు. నాగరికతకు బగ్గ దూరంల ఉన్నరన్నట్టు మాట్లాడుతుండ్రి. ఏదైనా సాహిత్యం మీటింగులకు పోతే అక్కడ తెలంగాణోల్లు అయిదారుగురే ఉంటుండ్రి.. అందరాల్లే. ఇవన్నీ సూసి, అనుభవించి, మాటలిని మా ఇద్దరికి తక్లీబ్ అయితుండే. ఇవన్నింటి తర్వాత మాకొక ఆలోచనవచ్చింది. రిటైర్ కాంగనే మన జిల్లాకు పోయి మనోళ్లను ఉషార్ చెయ్యాల. ఆల్లలెక్క ముందుకు పోవాల. గిసుంటి ఆలోచనలస్తుండే. మా ఇద్దరికి ఎవుసాయమంటే మస్తు ప్రేమ. ఈ కోరికను కూడా తీర్చుకోవచ్చని ఇంకొక ఆశ. ఏమన్నాగానీ అనుకొని 1992ల ఓ నాలుగెకరాల భూమి కొన్నం. మా ఇద్దరివి ఎవుసాయ కుటుంబాలు కావు. ఒక ట్రైనింగ్ సెంటర్ పెట్టి పిల్లగాండ్లను ఉషార్ చేద్దాం, అక్కడ్నే ఓ చిన్న ఇల్లు కట్టుకొని ఎవుసాయంల ఓనమాలు దిద్దుడు మొదలువెడతామని మా ఆశ.

జీవితం నడుస్తున్నది. ఏటా ఒకసారి నిర్మలచ్చుడు, సుట్టాలను దోస్తులను కలుసుడు, ఊర్లు తిరుగుడు, ఏమీ పంటెయ్యని భూమిని సూసుకొని మురుసుడు... అచ్చినప్పుడల్లా సంతోషం కంటే బాధ ఎక్కువ కలిగేది. అటుదిక్కు పల్లెలు ఎందుకు మంచిగున్నయ్, ఆల్లెందుకు ఖుషీగున్నరు, మన రైతులు ఎందుకు అవస్థలువడుతున్నరు, ఎవుసాయం ఎందుకు గిట్లున్నది, కరంటెందుకు గంటలకొద్దీ పోతది, పాలకులు ఎందుకు సవతి తల్లి ప్రేమలు సూపుతున్నరు... ఒక్కమాట చెప్పాల ఇక్కడ.. 1969ల నేను తొమ్మిదో తరగతిల ఉన్న. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పెద్దఎత్తున పోరాటం రాజుకున్నది. ఒక్క సంవత్సరం మా సదువు గాలిల కల్సుకపోయింది. పెద్దోల్లు వంతులకొద్దీ మా ఊరి నుంచి జైళ్లకు పోయిండ్రు. గండ్ల మా బాపుసుగ ఉండే.

రిటైర్మెంట్కు దగ్గరపడుతున్న. నిర్మలచ్చినప్పుడల్లా ఇంకో రెండుమూడేండ్లైతే ఇక్కడికచ్చే ఉంటాం గదా అని సంబుర పడేటోల్లం. కానీ, కరెంట్ కోతలు సూసి వణుకువుడుతుండే. ఏడెనిమిది గంటలు, ఒక్కోసారి రాత్రంతా... ఎండాకాలంల వస్తుంటిమి. సస్తుంటిమి. పరేషాన్... గిసుంటి ఊర్లె బతుకుతమా అనే ప్రశ్న సంపుతుండే. ఢిల్లీల మాకు మంచి జాగల అపార్ట్‌మెంట్ ఉన్నది. కరెంట్ అసలు పోనేపోదు. బయట సప్లయ్ పోంగనే హౌసింగ్ సొసైటీ జెనరేటర్‌తో సప్లయ్ అస్తది. గిసుంటి జీవితం సూసినంక గంటలకొద్దీ కరెంట్ వోతే ఎట్లా బతుకుడు అని, మేము తీసుకున్న నిర్ణయం మాకు వృద్ధాప్యంల ఇది శాపమైతే కాదుగదా అని భయపడేటోల్లం. మన జిల్లాకు అచ్చి మనకు తెలిసింది నలుగురికి చెప్పి ఆల్లను ఉషార్ చేద్దామనే జీవితాశయం, మన గడ్డపై శేష జీవితం గడిపే మా కోరికలు నెరవేరుతాయా అని ఇద్దరం చింతించేవాళ్లం.

కొత్త జిల్లా ఆఫీసు తెరుస్తారని తెలిసింది.. అప్పుడు నేను ఢిల్లీల ఉంటి. మన జిందగీలల్ల గిసుంటి మోఖా రాదని, కలెక్టర్ ఆఫీస్ రిబ్బన్ కత్రిచ్చుడు సూడాలని అచ్చిన. కండ్లనిండా కలెక్టరాఫీసు సూసిన. సంతోషంతోటి కండ్లల్ల నీళ్లచ్చినై. కొత్త జిల్లాకు నా సేవలను ఇచ్చేందుకు పెద్దపెద్దోల్లని కల్సిన. నేను వర్క్‌షాప్‌లు, కౌన్సెలింగులు చేస్తా.. ఇప్పటిదాకా 800 మంది నిర్మల్ జిల్లా వాసులకు ట్రైనింగ్ ఇచ్చిన.. వలంటీర్‌గా పనిచేస్తా అని చెప్పిన.

తెలంగాణ సంతోషాల మాగాణమైంది.. అందరికి తెలిసిపోయింది. ఇప్పుడు తెలంగాణ ఇజ్జత్ దునియాల మస్తువెరిగింది. అన్ని దిక్కులా రాకెట్ లెక్క ఉరుకుతున్నది. మన దేశపోల్లు, బయటోల్లు, ఎన్నో సంస్థలు, సదుకొన్నోల్లు మస్తుగా తారీఫ్ చేస్తున్నరు. పదేండ్లల్ల మస్తు పనయ్యింది. ఇంకా ఐదుపదేండ్లు ఒక్కటే చేతిలో (కేసీఆర్ పాలనలో) ఉంటే తెలంగాణ మరింత బలపడ్తది.

■ ఎలక్షన్ డెస్క్



తన సతీమణి మాధవీలతతో డాక్టర్ సంపత్ కుమార్



2014లో తెలంగాణ రాష్ట్రం అవతరించింది. ఖుషీ ఖుషీ... వాడిపోతున్న ఆశ చిగురించుడు మొదలైంది. పరిస్థితులు తప్పక మారుతాయన్న భరోసా! డబుల్ ధమాకా మాదిరిగా, 2016లో నిర్మల్ కొత్త జిల్లాగా అవతరించడంతో పండుగ చేసుకున్నం. తెలంగాణ తేజ్‌గా డెవలప్ అవుడు షురూ అయింది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మన ప్రాంతమేనా.. ఎట్లున్నది? ఎట్లయితున్నది?... చెబితే నమ్మరు. సూస్తే తెలుస్తది. మాకిప్పుడు ఢిల్లీ గుర్తుకు రాదు. సచ్చేదాకా తెలంగాణల్నే! మా బూడిద ఇక్కడి మట్టిల కల్సుడే!!



## అభివృద్ధి పిపాసి.. కళ్యాణ కారకుడు

అతడొక మహా సముద్రం
అతని ఆలోచనలు లోతైనవి,
ఊహకందనివి,
నిరంతరం ప్రజా సంక్షేమాన్ని
కాంక్షించే స్వాప్నికుడు
వాటిని తెరపైకి ఎక్కించే దార్శనికుడు
అతడే అతడే తెలంగాణ క్రాంతిదర్శి..
కల్వకుంట్ల చంద్రుడు!

సకల జనులను ఏకం చేసి..
సబ్బండ వర్గాలకు
ముందు నడిచిన ఉద్యమ వీరుడతడు..
తన చావుతోనైనా
తెలంగాణ రావాలని సవాల్ చేసి..
చావుకు ఎదురు నిలిచి పోరాడిన
ధీరోదాత్తుడు..
స్వరాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ రేడు

అతని అభివృద్ధి, సంక్షేమ పథకాలను
చవిచూసిన తెలంగాణ ప్రజల గుండెల్లో
గూడు కట్టుకున్న సముద్ర 'చంద్ర'గుప్తుని..
సంద్రంలోని నీటిని తోడెయ్యాలనుకోవడం
పిరికిపందల మూర్ఖపు చర్య...
ఎవ్వరెంతగా అరిచి గీమాలినా...
ఎవ్వరెంతగా జనాన్ని బతిమిలాడినా...
సంక్షేమకరుని తెలంగాణ చేజేతులా
జార్చుకోదు..

అతడు అనాథలు, అభాగ్యుల
ఆశ్రిత పక్షపాతి
నిరుపేదలకు సంక్షేమ పథకాలను
వెదజల్లే 'శీత'కరుడు
ప్రజా ఆశీర్వాద సభల్లో
ఉన్నదున్నట్లుగా...
నిస్సంకోచంగా... నిర్మొహమాటంగా...
బాహాటంగా చేసిన అభివృద్ధిని
మాట్లాడిన వాగ్గేయకారుడు...
అతడే అతడే తెలంగాణ జాతిపిత
కేసీఆర్..


అతడే మళ్లీ కావాలని, రావాలని..
హ్యాట్రిక్ దిశగా పయనించాలని..
తన గమ్యాన్ని ముద్దాడి భారీ మెజారిటీతో
సీఎం పదవిని అలంకరించాలని
కోరుకుంటూ
'తీన్ తారీఖ్' కోసం ఎదురు చూస్తున్నది
నిఖార్సైన తెలంగాణ జనం

... శాస్త్రుల రామశాస్త్రి

## రైతన్నా జర సోచాయించు

యారాక్

కాంగిరేసోడా కరెంటు తీగలు పట్టుకో కరెంటు ఉన్నదీ లేనిదీ నీ 'చెయ్యి'కి తెలుస్తుంది. నువ్వన్న ఐదు గంటలు.. ఆరు గంటలే కానీ తీగలను దండెంగా మార్చి బట్టలు ఆరేసుకుంటావో ఇంకేమి ఆరేసుకుంటావో అది నీ ఇష్టం.. ఏ సమయంలోనైనా తీగలను పట్టుకో .. నీకూ నీ వాళ్లకు.. తెలిసొస్తుంది. ఎద్దు యవుసం తెలియనోడా యాతం పోసిన రైతుల ఎద గోస నీకు తెలుసా? మూడు గంటల కరెంటా.. యవుసానికి సరిపోయేది? రైతన్నా జర సోచాయించు.. మళ్లీ కరెంటు కష్టాల సుడిగుండంలో చిక్కి గిలగిల కొట్టుకుని.. ఉరి కొయ్యలకు వేలాడ దీయడానికి.. దుఃఖ సాగరంలో ముంచడానికి.. బొంబాయి.. బొగ్గుబాయి.. దుబాయి బాట పట్టించడానికి మల్లొస్తుండు మాయమాటలతో ఓటరును మత్తరిచ్చడానికి. రైతుబంధుతో రాజును చేసి, రైతుబీమాతో రక్షణనిచ్చి కన్నీళ్లను తుడిచి వేయ, కాలేశుని కాల్వ నీళ్లనిచ్చి పంటలతో ధీమాగా ఉన్న జీవితాలకు భరోసానిచ్చిన కల్వకుంట్ల చంద్రునికే ఓటు వేద్దామా.. లేక కన్నీటి ధారలనిచ్చే కాంగిరేసుకు ఓటు వేద్దామా.. రైతన్నా జర సోచాయించు..నీ ఓటును వృథా చేసుకోకు.




- శారాశా (విశ్వామిత్ర), సిద్దిపేట


## నీళ్లిచ్చినోళ్లను మరువొద్దు..

యారాక్

**రాజయ్య :** ఏం నర్సింహా.. ఓటు ఎటేద్దాం అనుకుంటున్నవ్?
**నర్సింహా :** రెండుసార్లు కారుకి ఏసిన.. ఈసారి కొత్తోళ్లకు ఏద్దాం అనుకుంటున్న.
**రా..** వచ్చే ఏడాది ఎకరం అమ్మి కొడుకును అమెరికా పంపిస్తా, బిడ్డ పెండ్లి చేస్తా అంటివి కదా.
**న..** ఔను, ఎలక్షన్లకు, అవ్విటికి ఏం సంబంధమే?!
**రా..** ఎందుకు లేదు. ఉన్నది. పదేండ్ల కింద ఎకరానికి ఎంత ధర ఉండె?
**న..**మా పెద్దనాయన కొడుకు ఐదు లక్షలకు ఎకరం లెక్క అమ్మిండు.
**రా..** మరి ఇప్పుడు ఎంత పోతున్నది?
**న..**30 లక్షలు పోతున్నది.
**రా..** ఎందుకు ఇంత రేటు పెరిగింది?
**న..**అప్పుడంటే నీళ్లు ఎక్కడివి? ఇప్పుడు ఫుల్లు నీళ్లాయె.
**రా..** మరి, ఆ నీళ్లు ఎవలిచ్చిండ్రు? కేసీఆర్ ప్రభుత్వమే ఇచ్చింది కదా..



నువ్వు రెండుసార్లు కారుకు ఓటేస్తే నీకైతే లాభమే అయ్యింది కదా!
**న..**నాకొక్కనికేనా.. అందరికీ అయ్యింది.
**రా..** మరి, పాలిచ్చే బర్రెను కాదని నడ్డి మీద తన్నే దున్నపోతును తెచ్చుకుంటా అంటవేంది? పోయి పోయి కాంగ్రెస్ గెలిస్తే నీళ్లుండయి, కరెంటుండదు, భూములకు ఈ రేట్లు ఉండయి. బాగా ఆలోచించుకో.
**న..**నువ్వన్నది నిజమేనే. మల్లా కేసీఆర్‌కు ఓటేసుడే మనకు మంచిది!




'రూపాయికే కిలో చక్కెర' అని సూపర్ మార్కెట్ ప్రకటనల్లో కనిపిస్తూ ఉంటుంది. ఆఫర్ బాగుంది కదా.. ఓ నాలుగు కిలోలు తెచ్చుకుందాం అని వెళితే.. 'అందరికీ కాదు సార్.. రూ.2 వేల కంటే ఎక్కువ బిల్ చేసిన వారికే ఆఫర్ వర్తిస్తుంది' అని సేల్స్ బాయ్ చెప్పాడు. ఈ విషయం ముందు చెప్పాలి కదయ్యా అని అడిగితే.. 'మేము ఇచ్చిన ప్రకటనలో కండిషన్స్ అప్లయ్ అని ఉంది కదా సార్ చూడలేదా?' అని ఉల్టా దబాయించాడు.

## కాంగ్రెస్ హామీలు.. గాలిలో దీపాలే

ఓట్ల కోసం కాంగ్రెసోళ్లు ఇస్తున్న హామీలను చూస్తే కూడా సూపర్ మార్కెట్ ప్రకటనలే గుర్తుకు వస్తున్నాయి. రైతులతో పాటు కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తామని ఆ పార్టీ హామీ ఇచ్చింది. కానీ, ఇందుకు షరతులు వర్తిస్తాయట. ఆ కండిషన్ ఏంటో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డే పొరపాటున బయటపెట్టారు. 'రైతుబంధు కౌలు రైతులకు ఇస్తే.. అసలు రైతులకు ఇవ్వబోమని.. అసలు రైతులకు ఇస్తే.. కౌలు రైతులకు ఇవ్వం' అని తేల్చేశారు. ఓట్లు వేయించుకునేందుకు కాంగ్రెసోళ్ల హామీలు ఎట్లుంటయో చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలు. ఇట్లనే ప్రతి హామీకీ ఎన్ని కండిషన్లు పెడతారో? రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్తున్నారు కానీ, గెలిచాక ఏడాదికి రెండు సిలిండర్లకే ఈ హామీ వర్తిస్తుందని 'చెయ్యి'చ్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు! 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇచ్చేది కూడా నెలకు కాదు.. ఏడాదికి అని కండిషన్ పెట్టనూ వచ్చు! ఓటర్లూ తస్మాత్ జాగ్రత్త!!

- వరుణ్